ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 243 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 13 డిసెంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## 2027 జనాభా లెక్కలకు
# కేంద్రం గ్రీన్ సిగ్నల్
### అదే సమయంలో కులగణన కూడా!

న్యూఢిల్లీ, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)

దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద పరిపాలనాపరమైన ప్రక్రియ, జనాభా లెక్కలు-2027కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్న ఈ బృహత్ కార్యక్రమానికి రూ.11,718.24 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ఆమోదముద్ర వేశారు. ఈ జనగణనలో జనాభాతో పాటు కులాల వారీగా వివరాలను కూడా సేకరించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 'ఇళ్ల జాబితా, గృహ గణన' చేపడతారు. ఇక రెండో దశలో అసలైన 'జనాభా లెక్కింపు' కార్యక్రమాన్ని 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు.

అయితే, లడఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడిన ప్రాంతాల్లో మాత్రం జనాభా లెక్కింపును 2026 సెప్టెంబర్‌లోనే పూర్తి చేస్తారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 30 లక్షల మంది ఫీల్డ్ సిబ్బంది పాల్గొననున్నారు.



**తొలి డిజిటల్ సెన్సస్... అనేక కొత్త ఫీచర్లు**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇది 8వ జనాభా గణన కాగా, మొత్తంగా 16వది. ఈసారి దీనిని పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నారు. డేటా సేకరణ కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్‌ను (ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లలో) వినియోగిస్తారు. మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 'సెన్సస్ మేనేజ్‌మెంట్ %డ% మానిటరింగ్ సిస్టమ్'పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనిని రియల్ టైంలో సమీక్షించే వీలుంటుంది. ఈసారి ప్రజలకు 'సెల్ఫ్-ఎన్యూమరేషన్' పేరుతో స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో పాటు, అత్యంత ముఖ్యమైన అంశం కులగణన. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ 2025 ఏప్రిల్ 30న తీసుకున్న నిర్ణయం మేరకు, ఈ జనాభా గణనలో కులాల వారీగా వివరాలను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరిస్తారు. రెండో దశలో జనాభా లెక్కింపుతో పాటే ఈ ప్రక్రియ జరగనుంది.



## సీఎం రేవంత్‌తో ఆర్థికవేత్త
# సుబ్రమణియన్ భేటీ
### మర్యాదపూర్వకంగానే కలిసినట్లు సమాచారం

హైదరాబాద్, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ ఆర్థికవేత్త, భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సమాచారం. అయితే వీరి భేటీలో ఇటీవలి ఫ్యూచర్ సిటీ, పెట్టుబడులు తదితర అంశాలు చర్చకు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు. ఇదిలావుంటే శనివారం నగరంలో జరగబోయే 'మెస్సీ గోట్ ఇండియా టూర్' అనేది ఓ ప్రైవేట్ ఈవెంట్ అయినప్పటికీ రాహూల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా హాజరు కావాల్సిందిగా కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు ముఖ్యమంత్రి అక్కడి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈనెల 13న హైదరాబాద్ వస్తున్నారని.. ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమానికి తననూ ప్రత్యేక అతిథిగా పిలిచారని.. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధం లేని ఈవెంట్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్సీతోపాటు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటారు. అయితే, ఈ కార్యక్రమంలో మెస్సీ వర్సెర్స్ రేవంత్ రెడ్డి జట్లు 5 నిమిషాలపాటు మ్యాచ్ ఆడనున్నారు. మెస్సీతోపాటు ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# సీఎంతో అఖిలేశ్‌యాదవ్ భేటీ



హైదరాబాద్, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)

ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్ శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయన వెంట ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులున్నారు. అఖిలేశ్ యాదవ్‌కు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికిన రేవంత్‌రెడ్డి.. ఆయనతో కొద్దిసేపు జాతీయ రాజకీయాలపై మాట్లాడారు. యాదవ్‌లకు ఎంతో ఇష్టమైన సదర్‌ను రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నందుకు అఖిలేశ్ ప్రశంసించారు. యాదవుల హృదయంలో ఆయన ఉండిపోతారని వ్యాఖ్యానించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..
# ప్రభాకర్ రావు సరెండర్

హైదరాబాద్, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)



తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్ రావు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో సరెండర్ అయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. దీంతో, ప్రభాకర్ రావును.. సిట్ అధికారులు విచారించనున్నారు. ఈ కేసులో కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో గురువారం గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయనను అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు సవరించింది. తక్షణమే ఆయన విచారణాధికారుల ఎదుట లొంగిపోవాలని, కస్టోడియల్ విచారణకు సహకరించాలని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. కస్టడీ సమయంలో ఆయనపై ఎలాంటి థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని, శారీరక హింసకు గురిచేయకూడదని చెప్పింది. ఆయన వయసును దృష్టిలో ఉంచుకుని గౌరవంగా వ్యవహరించాలని సూచించింది. ఇంటి నుంచే భోజనం అందించాలని ఆదేశాల్లో తెలిపింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసింది.

**'క్రిమినల్స్ మధ్య 30 ఏళ్లు పనిచేశారు.. జాగ్రత్త!'**

విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఆయన 30 ఏళ్ల పాటు పోలీసు శాఖలో పనిచేశారు. ఎంతోమంది నేరస్తులను డీల్ చేసి ఉంటారు. కాబట్టి కస్టడీలో ఆయనకు ఎలాంటి శారీరక హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత మీదే' అని పోలీసుల తరపు న్యాయవాదికి సూచించింది. అయితే, ఆయనకు ప్రత్యేకంగా వీఐపీ ట్రీట్‌మెంట్ ఇవ్వలేమని, చట్టం అందరికీ సమానమేనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పష్టం చేశారు.

**ఆధారాలు ధ్వంసం చేశారు..**

అంతకుముందు.. రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ ప్రభాకర్ రావు అధికార దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా, సాక్ష్యాధారాలను పకడ్బందీగా ధ్వంసం చేశారని చెప్పారు. 2023 నవంబర్ 29న ఎన్నికలకు సరిగ్గా ఒకరోజు ముందు ప్రభాకర్ రావు సంతకంతో 50 కొత్త హార్డ్ డిస్క్‌లను కొనుగోలు చేశారని తెలిపారు. 30న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, డిసెంబర్ 2న రికార్డులన్నింటినీ ధ్వంసం చేయాలని ప్రభాకర్ రావు ఆదేశించారని చెప్పారు. డిసెంబర్ 4న ఫలితాలు వచ్చిన వెంటనే ప్రభాకర్ రావు రాజీనామా చేశారని, వెళ్లేముందు కంప్యూటర్ల నుంచి 50 పాత హార్డ్‌డిస్క్‌లను తీయించి, వాటిని కట్టర్లతో కోయించి నదిలో పారేయించారన్నారు. 'ఆయన చాలా తెలివైన అధికారి.. ఆధారాలు లేకుండా చేశారు' అని వ్యాఖ్యానించారు. ప్రభాకర్ రావు విషయంలో సహకరించడం లేదని సిట్ తరఫు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా చెప్పారు.

## మరింత బలపడనున్న
# తెలంగాణ-జర్మనీ సంబంధాలు



### జర్మనీతో తెలంగాణ సహకారంపై కీలక చర్చలు
### ఐటీ-డిఫెన్స్-ఫార్మా రంగాల్లో భాగస్వామ్యం ప్రాధాన్యం
### సైబర్ సెక్యూరిటీ బలోపేతంపై జర్మన్ ఆసక్తి
### 2047 విజన్ డాక్యుమెంట్‌ను జర్మనీ ప్రశంస

హైదరాబాద్, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)

తెలంగాణ ప్రభుత్వం, జర్మనీ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా శుక్రవారం ప్రజాభవన్‌లో కీలక సమావేశం జరిగింది. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి జర్మనీ పార్లమెంట్ ప్రతినిధి బృందంతో విస్తృతంగా చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ఐటీ, డిఫెన్స్, ఫార్మా, మెటలర్జీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కీలక రంగాల్లో సంయుక్త భాగస్వామ్యానికి మార్గాలు అన్వేషించడంపై ఈ సమావేశం దృష్టి సారించింది. సమావేశంలో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జర్మనీతో తెలంగాణకు ఉన్న సుదీర్ఘ స్నేహ బంధాన్ని గుర్తుచేశారు. ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణలో భారీ పెట్టుబడుల అవకాశాలు ఉన్నాయని, జర్మన్ కంపెనీలు రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. భవిష్యత్ దృష్టితో నిర్మాణంలో ఉన్న భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగాల అభివృద్ధి వంటి ప్రాజెక్టుల్లో కూడా జర్మన్ సంస్థలకు కీలక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ యువతను జర్మనీ పరిశ్రమలకు అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేకంగా జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేసి, జర్మనీలో ఉన్న ఉపాధి అవకాశాలు తెలంగాణ విద్యార్థులకు మరింత చేరువవుతాయని వివరించారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో తెలంగాణ ఇప్పటికే ముందు వరుసలో ఉందని మంత్రి శ్రీధర్ బాబు జర్మన్ బృందానికి వివరించారు. హైదరాబాద్ సైబర్ ఎక్సలెన్స్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక యూనిట్లు, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న సైబర్ సెక్యూరిటీ వింగ్స్, ఆర్థిక నేరాలను ఎదుర్కొనే ఆధునిక ఈ చర్యలు తెలంగాణను దేశంలోనే అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ హబ్‌గా నిలిపాయని పేర్కొన్నారు.

# చలి చంపుతోంది..

### 28 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు నమోదు
### సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో కనిష్ఠం 5.8 డిగ్రీలు

హైదరాబాద్, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)



రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఏకంగా 28 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో అత్యల్పంగా 5.8 డిగ్రీల సెల్సియస్ నమోదయింది. దీంతో గత దశాబ్దపు రికార్డు (డిసెంబరు 12న ఇంత తక్కువ నమోదు కావడం) బద్దలైంది. దీంతోపాటు డిసెంబరు రెండోవారంలో ఎక్కువ జిల్లాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడం కూడా ఇదే తొలిసారని.. ఇంత తక్కువ గతంలో నమోదు కాలేదని వాతావరణశాఖ తెలిపింది. కొన్ని రోజులుగా వరుసగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల కంటే తక్కువకు పడిపోతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బహిరంగ ప్రాంతాలు, శివార్లలో చలిగాలుల తీవ్రత మరింతగా ఉండటంతో వణికిపోతున్నారు.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

# ప్రభుత్వ పాఠశాలలో 44 మంది విద్యార్థులకు అస్వస్థత



అసుపత్రి చికిత్స పొందుతున్న విద్యార్థులు



విద్యార్థులను పరామర్శించిన డీఎంఅండ్ హెచ్ఓ తోపాటు ఇతర అధికారులు

శేరిలింగంపల్లి, డిశంబర్ 12,(ప్రభాత ఉదయం) ప్రభుత్వ పాఠశాలలో 44 మంది విద్యార్థులు ముకుమ్మండి అస్వస్థతకు గురికావడంతో పాఠశాల వాతవరణ భయందోళనగా మారింది. విద్యార్థు ఒకరి తర్వాత ఒకరు వాంతులు కళ్ళు తిరిగి పడిపోతుండడంతో ఆందోళన చెందిన ఉపాధ్యాయు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వైద్య శాఖ అధికారులు విద్యార్థులను అసుపత్రికి తరలించిన సంఘటన హైటెక్ సిటీకి కూతవేటు దూరంలోని చందానాయక్ తండాలో జరిగింది. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సంఘటన మాదాపూర్ తీవ్ర సంచలనంగా మారింది. చందానయక్ ప్రభుత్వ పాఠశాలలో ఓ స్వచ్ఛ సంస్థ వారు ఉదయం టిఫిన్గ గా మైసూర్ బొండాలు అందించారు. అనంతరం పాఠశాలలో యధావిధిగా విద్యార్థులు భోజనం అందించారు. రెండన్న తర్వాత విద్యార్థుల కళ్ళు తిరగడం వాంతులు అవుతుండడంతో ఒకరి తర్వాత ఒకరు కళ్ళు తిరిగి కిందపడిపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టి వరావడంతో ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా వైద్య శాఖ అధికారులకు 108 సమాచారం అందించి అస్వస్థకు గురైన విద్యార్థులను కొండాపూర్ ఏరియా అసుపత్రికి తరలించారు. 38మంది కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరుగురిని నాపహనాక్ రామ్ గూడలోని రెయిన్ బో అసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఇందులో 22మంది బాలికలు 22మంది బాలురుకి చికిత్స అందిస్తున్నట్లు జిల్లా వైద్య అధికారిణి లలితా దేవి తెలిపారు. ఉదయం బొండాలు తినడం వలన ఫుడ్ పాజన్ అయిందా లేక మధ్యాహ్నం భోజనంలో తేడా జరిగిందా తెలుసు కుంటున్నామని చెప్పారు. ఫుడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించామని తెలిపారు. పరీక్షల అనంతరం తెలుస్తుందని లలిత దేవి తెలిపారు. సాయంత్రం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉండడంతో పరీక్షలు చేసి అనంతరం మందులిచ్చి డిఛార్జ్ చేసినట్లు అమె వివరించారు. ఎవరైన నిర్లక్ష్యం వహించినట్లు తెలితే చర్య తీసుకుంటామని చెప్పారు. శేరిలింగంపల్లి ఎంఆర్ఓ వెంకారెడ్డి, ఎంఈఓ వెంకటేష్, గచ్చిబౌలి సీఐ బాలరాజు, మాదాపూర్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు విద్యార్థులను పరామర్శించారు.

# ఆకుతోటపల్లి గ్రామ అభివృద్ధికి కత్తెర గుర్తుకు ఓటెయ్యాలి

## గెలుపు బాటలో నిట్ట నారాయణ

ఆమనగల్లు, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం)

ఆకుతోటపల్లి గ్రామ అభివృద్ధి కోసం కత్తెర గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నిట్ట నారాయణ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. చివరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆకుతోటపల్లి, గౌరారం గ్రామాలలో నారాయణ విస్తృత ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆశీర్వాదంతో సర్పంచ్గా గెలిచిన వెంటనే గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తానని నారాయణ తెలిపారు.నారాయణను గెలిపించుకునేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ..

ఆకుతోటపల్లి నుండి గౌరారం మీదుగా ముద్విన్ వరకు ఎమ్మెల్యే నిధుల నుండి బి టీ రోడ్డు వేయిస్తాని అన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజి, నీటి, వీది దీపాలు మరియు విద్యుత్ స్తంభాలు వేయిం చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను అన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు కార్డులు ఇప్పిస్తామన్నారు.

గౌరారంకు ఆర్టీసీ బస్సులు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని/విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తానని తెలిపారు.గ్రామంలో పుట్టబోయే మహలక్ష్మీలకు రూ॥ 10,000/- అందిస్తానని చెప్పారు.

గ్రామంలో ఉన్న వయో వృద్ధులకు, గర్భిణీ స్త్రీ లకు ఆమనుగల్లు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి ఉచిత ప్రయాణం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

18 సంవత్సరాలు నిండినటువంటి పేద యువతి/యువకులకు మరియు రైతులకు పోస్టాఫీసులో ప్రమాద భీమా కల్పిస్తానని పేర్కొన్నారు.



ఆకుతోటపల్లిలో ప్రచారం చేస్తున్న నారాయణ, పడమటి శ్రీధర్ రెడ్డి.

# రామంతపూర్‌ను సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



రామంతపూర్ డివిజన్ లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఉప్పల్ సర్కిల్ ) డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం): రామంతపూర్ డివిజన్‌లో మొత్తం కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు లు పాల్గొని అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామంతపూర్ డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా తీర్చిదిద్దుతానని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శ్రీనగర్ కాలనీలో ఓపెన్ జిమ్ తో పాటు సీసీ రోడ్డు నిర్మాణం, భవాని నగర్‌లో స్టామ్ వాటర్ డ్రెయిన్, వాసవి నగర్ రోడ్ నం.2 లో సీసీ రోడ్డు వంటి పలు అభివృద్ధి పనులను చేపట్టామని చెప్పారు. డివిజన్ అభివృద్ధి కోసం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందించడంలో ఎమ్మెల్యే కార్పొరేటర్ చేస్తున్న నిరంతర కృషిని స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో డివిజన్‌ల పెంపుపై నాయకుల హర్షం

## మా ప్రాంతాలను ఫలానా డివిజన్ లోనే ఉంచండి అంటు వినతుల వెల్లువ

బుద్వేల్, డిసెంబరు 12 (ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ సర్కిల్ లో ఐదు డివిజన్లను ఏడు డివిజన్లుగా పెంచడం పై ఆశావాహులు ఓ వైపు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరో వైపు తమ బస్తీలను ఇతర డివిజన్లలో కలిపారంటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్లపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఏడు రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలని




జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఈ నెల 10వ తేదీన సూచించడంతో ఇప్పటి వరకు రాజేంద్రనగర్ సర్కిల్ లో 65 అభ్యంతరాలను వినతి పత్రాల రూపంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు అందజేశారు.

**కొత్తగా రెండు డివిజన్లు ఏర్పాటు చేయడం సంతోషకరం : మాజీ కార్పొరేటర్ రావుల విజయ జంగయ్య :**



రాజేంద్రనగర్ సర్కిల్ లో గతంలో ఉన్న ఐదు డివిజన్లను ప్రస్తుతం ఏడు డివిజన్లకు పెం చడం సంతోషకరమని అత్తాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల విజయ జంగయ్య అన్నారు. గతంలో అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్ దేవుపల్లి సులేమాన్ నగర్, శాస్త్రీపురం డివిజన్లు ఉండగా, ప్రస్తుతం హైదర్ గూడ , కాటేదాన్ డివిజన్లను అధనంగా పెంచారు. ఇది శుభపరిణామమని రావుల విజయ జంగయ్య అన్నారు. గతంలో ఉన్న అత్తాపూర్ డివిజన్ ను ప్రస్తుతం అత్తాపూర్ తో పాటు హైదర్ గూడ పేర్లతో రెండు డివిజన్లను ఏర్పాటు చేశారన్నారు. హైదర్ గూడ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తు ఉండటంతో హైదర్ గూడ పేరుతో డివిజన్ ను ఏర్పాటు చేయడం సబబే అన్నారు. హైదర్ గూడ డివిజన్ ఏర్పాటు తో కార్పొరేటర్ గా పోటీ చేయాలనుకునే వారికి మంచి అవకాశం వచ్చినట్లే అని గుర్తు చేశారు.

**కాటేదాన్ డివిజన్ ఏర్పాటు సంతోషకరం : ఎస్ వెంకటేశ్, మాజీ కౌన్సిలర్ :**



మైలార్ దేవుపల్లి డివిజన్ పెద్దదిగా ఉండటంతో ఆ డివిజన్ ను మైలార్ దేవుపల్లి తో పాటు కాటేదాన్ డివిజన్లుగా రెండు డివిజన్లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ అన్నారు. కాటేదాన్ పారిశ్రామిక వాడ ద్వారానే ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. కాటేదాన్ డివిజన్ పరిధిలో ఉన్న నాయకులకు సంతోషం అని అదే సమయంలో బస్తీల అభివృద్ధికి డివిజన్ ఏర్పాటు చేయడం కలిసొచ్చే అవకాశం అని గుర్తు చేశారు. గతంలో శాస్త్రీపురం డివిజన్ పరిధిలోకి వచ్చే బండ్లగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రాంతం, అలీనగర్ ప్రాంతాలను కాటేదాన్ లో కలపడం బాధాకరమని, దీనిపై అధికారులు పునరాలోచించాలన్నారు.

**డివిజన్ ఏర్పాటు పై అభ్యంతరాల వెల్లువ :**

రాజేంద్రనగర్ సర్కిల్ లో ఏర్పాటు చేసిన డివిజన్ల ఏర్పాటు పై వివిధ పార్టీల నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ డివిజన్ లో ఉన్న శివరాంపల్లి బస్తీని సులేమాన్ నగర్ డివిజన్లో కలిపారని, ఇది చాలా బాధాకరమని, దీనిపై అధికారులు పునరాలోచించాలన్నారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కు, రాజేం ద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పలు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, శివరాంపల్లి బస్తీ పెద్దలు పెంద్యాల చంద్రమోహన్, పడమటి శ్రీధర్ రెడ్డి లు తెలిపారు.

**గగన్ పహాడ్ బస్తీ ని మైలార్ దేవుపల్లి లోనే ఉంచాలి : సరికొండ వెంకటేష్**



గగన్ పహాడ్ బస్తీలోని కుడి వైపును రాజేంద్రనగర్ డివిజన్ లో , ఎడవ వైపును మైలార్ దేవుపల్లి డివిజన్ లో కలిపారని ఇది కూడా బాధాకరమని కాంగ్రెస్ నాయకులు సరికొండ వెంకటేష్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ తమకు చాలా దూరం అవుతుందని, తమ బస్తీ మొత్తాన్ని మైలార్ దేవుపల్లి డివిజన్ లో కలిపితే బాగుంటుందని ఆయన అంటున్నారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో, గ్రేటర్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సరికొండ వెంకటేష్ అన్నారు. గతంలో బవానీకాలనీ, ప్రేమావతిపేట్ బస్తీలు మైలార్ దేవుపల్లి డివిజన్ లో ఉం దేవని, నేడు వాటిని రాజేంద్రనగర్ డివిజన్ లో కలుపుతు నిర్ణయం తీసుకున్నారని. ఇది కూడా బాధాకరమైన విషయమని బీజేపీ నాయకులు జి పాండు యాదవ్ వాపోయారు. శాటిలైట్ ద్వారా రోడ్లను బట్టి వార్డుల సరహద్దులను గుర్తించడం జరిగిందని, ఇప్పటికైన అధికారులు స్పం దించి రాజకీయ పార్టీల నాయకులు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులను పిలిచి వారి సమక్షంలో అభ్యంతరాలను సరి చేయాలని విజ్ఞప్తి చేశారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె కేశవరావు కు జ్ఞాపిక ను బహుకరిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఈ నవీన్ నికోలస్

# విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి

## డాక్టర్ కె కేశవరావు

బుద్వేల్, డిసెంబరు 12 (ప్రభాత ఉదయం) : విద్యార్థులను విధ్య తో పాటు అన్ని రంగాలలో తీర్చిదిద్దినప్పుడే వారు సమాజం గురించి తెలుసుకుంటారని, అది వారి జీవితంలో నిలదొక్కుకోవడానికి ఉపయోగపడుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె కేశవరావు అన్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్ జోనల్ లెవల్ స్కూల్ బ్యాండ్ కాంపిటీషన్స్ శుక్రవారం ముగిసాయి. తొమ్మిది రాష్ట్రాల నుంచి 21 బ్రాస్, పైప్ బ్యాండ్ టీమ్లకు చెందిన బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ కె కేశవరావు చేతులమీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో విద్యార్థులను బ్యాండ్ వాయించడం లో శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో పోటీలు పెట్టి వారి ప్రతిభ ను వెలికి తీయడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ నవీన్ నికోలస్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో పైప్ బ్యాండ్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో కర్ణాటక కు చెందిన పిఎస్ శివశంకరప్ప ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రధమ స్థానంలో నిలిచి బహుమతులు గెలుచుకున్నారన్నారు. ద్వితీయ స్థానంలో చత్తీస్ ఘడ్ కు చెందిన ద గ్రేట్ ఇం డియా సైనిక్ స్కూల్ విద్యార్థులు నిలిచారన్నారు. తృతీయ స్థానంలో పుదుచ్చేరీ కి చెందిన అమలోర్పావం హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు విజయం సాదించారన్నారు. పైప్ బ్యాం డ్ బాలికల విభాగంలో తెలంగాణ రాష్ట్రంకు చెందిన ఖమ్మం వైరా టీజీ ఆర్ జేసీ స్కూల్ విద్యార్థులు విజయం సాదించారన్నారు. ద్వితీయ స్థానంలో కర్ణాటక కు చెందిన పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఎఎస్సీ సెంటర్ విద్యార్థులు నిలిచారన్నారు. తృతీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు గెలుపొందారన్నారు. బ్రాస్ బ్యాండ్ బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన మాంటిసోరి ఇండూస్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ కు చెందిన సెయింట్ ఆంద్రూస్ హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం లో నిలిచారన్నారు. తృతీయ స్థానంలో తమిళనాడు కు చెందిన సీఎంఎస్ మెట్రిక్యులేషన్ హెచ్ ఆర్ సెంకండరీ స్కూల్ విద్యార్థులు గెలుపొందారన్నారు. బ్రాస్ బ్యాండ్ బాలికల విభాగంలో మొదటి బహుమతిని తమిళనాడు కు చెందిన అవిల కాన్వెంట్ మ్యాట్ హెస్ఆర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు విజయం సాదించారు. ద్వితీయ స్థానంలో కేరళ కు చెందిన ప్రొవిడెన్స్ గర్ల్స్ హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు విజయం సాదించారన్నారు. మూడవ స్థానంలో తెలంగాణ కు చెందిన సెయింట్ ఆంద్రూస్ హై స్కూల్ విద్యార్థులు విజయం సాదించారన్నారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్, బ్యాండ్ ప్రోగ్రామ్ స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీనాథ్, అసిస్టెంట్ స్టేట్ కో ఆర్డినేటర్ జావీద్, విద్యాశాఖ ఉన్నతాధికారులు చంద్రగౌడ్, సత్యనారాయణరెడ్డి, ఎ బాలరాజు, టి విజయ్సాగర్ లు పాల్గొన్నారు. భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, సమగ్ర శిక్ష సంయుక్తంగా బ్యాండ్ పోటీలను నిర్వహిస్తున్నదన్నారు. ఈ పోటీలు దేశంలోని నాలుగు జోన్లలో జరుగుతున్నాయన్నారు. నాలుగు జోన్లలలో గెలుపొంది ప్రధమ స్థానంలో నిలిచిన వారు త్వరలో జాతీయ స్థాయిలో నిర్వహించే బ్యాండ్ పోటీలలో పాల్గొంటరన్నారు. అక్కడ విజయం సాదించిన వారిని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పెరెడ్ లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు.



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి...

# పాఠశాలలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం మార్గం చూపిస్తా

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( రామంతాపూర్ డివిజన్ ) డిసెంబర్ 12 ( ప్రభాత ఉదయం ):- పాఠశాలలో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రామంతపూర్ డివిజన్లో పాలు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మండల ప్రాథమిక పాఠశాల రామాంతపూర్ నందు గల పాఠశాలలో 255 మంది విద్యార్థులకుగాను టీచర్స్ 8 మంది కావల్సి ఉండగా నలుగురు టీచర్స్ ఉన్నారని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఉపాధ్యాయులు లేకపోవడం విద్యార్థులకు సరైన పద్ధతిలో భోధన చేయలేక పోతున్నామని ఎమ్మెల్యే కు విన్నవించారు. కనీసం విద్య వాలంటీర్లను నియమించినచో విద్యార్థులకు చక్కటి భోజనం అందిస్తామని ఎమ్మెల్యేకు చెప్పారు . పాఠశాలలో హైస్కూల్ విద్యార్థులు సుమారు 700, మొత్తం ప్రైమరి, హైస్కూల్ తో కలిపి 1000 మంది విద్యార్థులు ఉండడంతో మంచినీరు సరిపోవడం లేదు. మాకు అదనపు కనెక్షన్ ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. మూత్రశాలలు అస్తవ్యస్తంగా మారడంతో పాటు డ్రైలేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అందులో నుండి నీరు బయటకు వెళ్లలేక దుర్గంధం వెదజల్లడంతో విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎండిఎం పథకము క్రింద విద్యారులందరికి పాఠశాలలోనే వంట చేసి పెట్టే అవకాశం ఉన్నప్పటికి దానికి షేడ్డు లే లేకపోవడంతో వంట చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. వర్షం పడినప్పుడు చాలా ఇబ్బందులకు గురవుతున్నామని ఎమ్మెల్యేకు చెప్పారు. పాఠశాల నందు తరగతి గదులు సరిపోక పోవడంతో విద్యార్థులకు భోదన బయట చేయల్సి వస్తుందన్నారు. మాకు బిల్డింగ్ పైన మూడు రూమ్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యేలు కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల నా మజాకా







**కనుమరుగవుతున్న చిన్న జాతర..??**

**చిన్న జాతరలో చిరు వ్యాపారుల అంగడ్లకు అడ్డు తగిలిన బిల్డింగ్ ఓనర్లు**

**ఊరు బయట దుకాణాలు ఏర్పాటు చేసుకోమని చెప్పిన అధికారులు**

**ఊరి బయట దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకురాని చిరు వ్యాపారులు**

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్12(ప్రభాత ఉదయం) గద్వాలలోని భీంనగర్ లో గల శ్రీసంతాన వేణుగోపాల స్వామి దేవాలయం వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించడం సంప్రదాయం. బ్రహ్మోత్సవాల సందర్భంగా కృష్ణవేణి చౌరస్తా, భీంనగర్ లో నిర్వహించు చిన్న జాతర రోజురోజుకు కనుమరుగవుతోంది. నెల రోజులపాటు జరుగు చిన్న జాతరలో రోడ్డుపై మిఠాయి దుకాణాలు, ఆటవస్తువులు, తినుబండారాలు, వంటసామాగ్రి, బ్యాంగిల్స్ స్టోర్స్, రంగుల రాట్నం జాయింట్ వీల్స్ ఇలా వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఈ జాతరలో కర్నూల్, అయిజ, ఎమ్మిగనూరు, కర్ణాటకకు చెందిన చిరు వ్యాపారులే అధికం. కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీ అగ్రహారం రోడ్డు వెంటా సుమారు మూడు వందలకు పైగా తాత్కాలిక గూడారాలు(షాపులు) వెలుస్తుంటాయి. నెల రోజుల అనంతరం తమ వ్యాపారులు ముగించుకుని రాయచూర్, ఎమ్మిగనూర్ లో జరుగు జాతర్లకు తరలివెళుతుంటారు. గత కరోనా కాలం నుంచి రోజు రోజుకు చిన్న జాతర అంతరించిపోతుంది. దీనికి తోడు ఈ సంవత్సరం భీంనగర్ రోడ్డులో గల బిల్డింగ్ ల ముందు తాత్కాలిక దుకాణాలు వేయోద్దంటూ బిల్డింగ్ ఓనర్లు మున్సిపల్ అధికారులను కోరడంతో.... అధికారులు చిరువ్యాపారులను జాతర్లో దుకాణాలు వేసుకోవద్దని హుక్కుం జారీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఊరి బయట గల నదీ అగ్రహారం రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో దుకాణాలు వేస్తే తమ వ్యాపారాలు ఎలా సాగుతాయంటూ చిరు వ్యాపారాలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఊరు బయట దుకాణాలు వేస్తే వినియోగదారులు, కష్టమర్లు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని చిరు వ్యపారులు వాపోయారు. కొన్నేండ్ల క్రితం ఈ ప్రాంతంలో ఎలాంటి భవనాలు, ఇండ్లు లేవని అప్పటి నుంచే వ్యాపారం కొనసాగిస్తున్న తరుణంలో బిల్డింగ్ ఓనర్లు అడ్డం వస్తాయన్నా సాకుతో దుకాణాలు వేసుకోకుండా ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. భీంనగర్ లో గల భవన యజమానులు జాతర పేరుతో రోడ్డుపై బ్రతికే వందల కుటుంబాల పొట్ట కొట్టడం సరైంది కాదని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఊరు బయట చికెన్, మటన్ దుకాణాలు మాత్రమే ఏర్పాటు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని, ఇతర వ్యాపారులకు అనుకూలించదన్నారు. ఏండ్ల చరిత్ర గల చిన్న జాతర్లో రోడ్డుపై వ్యాపారాలు చేసుకుని బతికే చిరు కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తే రాను రాను చిన్న జాతర అంతరించిపోయే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నయి. జిల్లా ఉన్నతాధికారులు చిన్న జాతర పై దృష్టి సారించి చిన్న జాతరకు పూర్వవైభవం వచ్చేలా కృషి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.





మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ (ఫైల్ ఫోటో) .. హాస్పిటల్ లో ప్రతాప్ గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

## గుండెపోటుతో మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం) జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండల మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్(60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గద్వాలలోని ఆయన నివాసంలో ఉన్న సమయంలో గుండెపోటు రాగ గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయనను పరీక్షించి వైద్యం అందించాల్సిందిగా సూచించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 2014-2019 వరకు గద్వాల వైస్ ఎంపీపీగా , 2019 నుంచి 2024 వరకు ఎంపీపీగా కొనసాగారు. మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ మరణంతో అనంతపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులకు గద్వాల ఎమ్మెల్యే సంతాపం.. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గద్వాల జిల్లా ఆసుపత్రిలో మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్ పార్థీవదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎంపీపీగా ఉన్న సమయంలో మండలాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని.. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

## గూడెందొడ్డి సర్పంచ్‌గా పద్మావతి నర్సింహులు విజయం




గద్వాల జిల్లా ప్రతినిధి (ధరూర్ ), డిసెంబర్12(ప్రభాత ఉదయం)ధరూర్ మండల గూడెందొడ్డి గ్రామపంచా యతీలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ బలపరిచన సర్పంచ్ అభ్యర్థి పద్మావతి నర్సింహులు తన సమీప అభ్యర్థి కుర్వ శారదమ్మ పై 302 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. గూడెందొడ్డి లో 1176 ఓట్లు నమోదు కాగా ఉంగరం గుర్తు అభ్యర్థి పద్మావతి నర్సింహులుకు 752 ఓట్లు రాగ బ్యాట్ గుర్తు అభ్యర్థి కుర్వ శారదమ్మకు 450 ఓట్లు వచ్చాయి. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బలపరిచిన కుర్వ శారదమ్మ బరిలో నిలిచా రు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి సరిత సర్పంచి అభ్యర్థిగా పద్మావతి నర్సింహులు బరిలో నిలిచారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటినుండి హోరా హోరి గా జరిగిన ప్రచారం లో భాగంగా గురువారం జరిగిన పోలింగ్లో కె.పద్మావతి నర్సింహులు 302 పైచిలుకు ఓ ట్లతో విజయం సాధించారు. గ్రామస్తులు పార్టీ అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తమ గెలుపుకు సహకరించారని వాళ్ళందరికీ ధన్యవాదాలు నూతన సర్పంచ్ పద్మావతి తెలిపారు. గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## జనగామ మండలం లోని పలు గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం): వరంగల్ వెస్ట్ జోన్ జనగామ డీసీపీ, ఏసీపీ ఆదేశాల మేరకు, శుక్రవారం సిఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంలో మండలం లోని వడ్లకొండ, గనుగుపహాడ్, ఎర్రగొల్లపహాడ్ గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, భద్రతతో సాగేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించబడిందని. మార్చ్ సమయంలో గ్రామస్తులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) గురించి అవగాహన కల్పించారు. ఎన్నికల కాలంలో శాంతి భద్రతలను కాపాడుకునే అవసరాన్ని వివరించారు.. అలాగే ఎంసీసీ ఉల్లంఘనలు, అక్రమ కార్యకలాపాలు, ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించే చర్యలపై చట్టపరమైన పరిణామాలు గురించి కూడా తెలియజేశారు.అధికారులు గ్రామాల్లోని సున్నిత ప్రాంతాలను పరిశీలించి, గ్రామస్థులతో మాట్లాడి, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం గ్రామస్తుల్లో నమ్మకాన్ని పెంచి, రాబోయే ఎన్నికలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు బలంగా ఉన్నాయని వారికి ధైర్యం కలిగించిందన్నారు.



## నర్కుడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన శేఖర్ యాదవ్‌కు సన్మానం

శంషాబాద్, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని నర్కుడ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన గడ్డం శేఖర్ యాదవును గ్రామానికి చెందిన నీరటి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. శేఖర్ యాదవ్ ను సన్మానించిన వారిలో రమాదేవి, స్వప్న, లావణ్య, వెన్నెల, భవాని, సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

## మొదటి విడత ఎన్నికల విధులకు గైర్హాజరైన 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం): మొదటి విడత ఎన్నికల విధులకు గైర్హాజరైన 71 మంది అంగన్వాడీ, ఎస్జిటి, ఇతర ఉపాధ్యాయులు, అధికారులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా.. మొదటి విడత ఎన్నికల విధులకు 71 మంది అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు ఎన్నికల విధులు చాలా కీలకమని, వీటికి హాజరు కాని 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇస్తూ... రెండవ విడత ఎన్నికల విధులను కేటాయించిన సంబంధిత ఎంపీడీఓ దగ్గరికి రేపు వెళ్లి రిపోర్ట్ చేయడం తో పాటు..సంజాయిషీ రిపోర్ట్ని ఎంపీడీఓ ద్వారా తమకి పంపించాలని ఆదేశించారు.

## పేద, మధ్య తరగతుల వారికోసమే నిర్మించిన హౌసింగ్ బోర్డు కాలోని 3 ముక్కలా?

**విడదీయకుండా ఉండేలా జిహెచ్ఎంసి అధికారులు పునరాలోచన చేయాలి**


**జనసేన నాయకులు కొల్లా శంకర్**



కూకట్ పల్లి, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం) పేద, మధ్య తరగతుల వారికోసమే నిర్మించిన హౌసింగ్ బోర్డు కాలోని కెపిహెచ్బి, బాలాజీనగర్, వసంత్ నగర్ అని మూడు ముక్కలు చేసి విడతీయడం సరికాదని జనసేన నాయకులు కొల్లా శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొల్లా శంకర్ మాట్లాడుతూ ఇప్పటికే వాటర్, డ్రేనేజ్, ట్రాఫిక్, అక్రమ కట్టడాలు, ఇళ్ల మద్య వైన్ షాపులు, హాస్టల్ వలన అంబులెన్స్ లు పోవడానికి దారి లేకుండా ఇబ్బందులతో వున్న ప్రజలకు మరొక ఇబ్బంది సృష్టిస్తున్నారని అన్నారు. ఒక గవర్నమెంట్ స్కూల్ లేక,100 పడకల హాస్పిటల్ లేక, లైబ్రరీ లేక, అట స్థలము లేక ఇబంది పడుతున్న ప్రజలకు ముగ్గుర కార్పొరేటర్లతో మరోసమస్య గా మారుతుంది అని తెలిపారు. మోరీలు ఒక డివిజన్ లో పొంగితే మురికి నీరు వేరొక డివిజన్ లో పారడం ఇబ్బంది పడుతున్న ప్రజలు ఎవరి వద్దకు వెళ్ళాలి అని ఆయన ప్రశ్నించారు. కెపిహెచ్బి డివిజన్ ఈ డబ్ల్యు ఎస్, ఎల్ఐసి, ఎం ఐ జి, హెచ్ ఐ జి లలో నివసించే ప్రజలను విడతీయకుండ అన్ని ఒకరి సారధ్యం ఉండేలా పునరాలోచన చేయాలని జిహెచ్ఎంసి అధికారులను జనసేన తరపున కోరుకుంటున్నామని అన్నారు.

## బీసీల 42% రిజర్వేషన్లు పెంచుతూ పార్లమెంట్ సమావేశాలలో ఆమోదించాలి

**చలో ఢిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



కూకట్ పల్లి, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం) జనాభా ధమాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు 42% పెంచాలనే డిమాండుతో ఈ నెల 15 వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా న్యూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి తెలంగాణ బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెళ్లనున్న బిసీ మహిళా సంక్షేమ సంఘం సభ్యులకు శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శుభాకాంక్షలు తెలుపుతూ వారి చేతులమీదుగా చలో ఢిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ బిసీ రిజర్వేషన్లు 42% పెంచుతూ తెలంగాణ అసెంబ్లీ లో చేసిన చట్టాన్ని ఈ పార్లమెంట్ సమావేశాలలోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిసీలందరు అధిక సంఖ్యలో పాల్గొని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, శ్యామల, రాజేశ్వరి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కి జల్ ప్రహరీ సమ్మాన్ పురస్కారం

**రెండు తెలుగు రాష్ట్రాల నుండి జనగాం జిల్లా కలెక్టర్ కె దక్కిన పురస్కారం**

**భూగర్భ జల సంరక్షణ,నీటి పునరుద్ధరణ, నీటి వనరులపరిరక్షణ,వినూత్న పద్ధతులను అమలు చేసినందుకు...**

**డిస్ట్రిక్ట్ గ్రౌండ్ వాటర్ అసెస్మెంట్ రిపోర్ట్‌లో.. జిల్లా లో భూగర్భ జలాలు పెరిగినట్లు గుర్తింపు**

**భాగస్వామ్యం అయిన అధికారులకు కలెక్టర్ అభినందనలు**





జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం): ఒక మంచి పనిని ప్రారంభం చేస్తే, దాని తాలుకు ప్రయోజనం భవిష్యత్ తరాలకు అందుతుంది అని ఎన్నో కార్యక్రమాల ద్వారా అందరం చూసే ఉంటాం.. ప్రయోజనం ఒక్కటే కాదు, అవార్డు లు, పురస్కారాలు కూడా అదే స్థాయి లో ఉంటాయి అని మళ్ళీ మళ్ళీ నిరూపణ అయ్యింది. వివరాలకు వెళ్తే, భూ గర్భ జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఇచ్చే "జల్ ప్రహరీ సమ్మాన్" ప్రతిష్టాత్మక పురస్కారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి దక్కింది.రెండు తెలుగు రాష్ట్రాలల్లో.. కేవలం జనగాం జిల్లా కలెక్టర్ కి దక్కడం తో వివిధ శాఖల అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.జల్ శక్తి మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ వంటి సంస్థలు నిర్వహించే ఈ కార్యక్రమం లో భాగంగా, నీటి సంరక్షణ, పునరుద్ధరణ, నీటి వనరుల పరిరక్షణ,నీటి సంరక్షణ ప్రాజెక్టులు, వినూత్న పద్ధతులను పాటిస్తూ అంకితభావంతో పనిచేసే వారిని గుర్తించి, ప్రోత్సహిస్తారు.ఇందులో భాగం గా గురువారం న్యూ ఢిల్లీ లోని మహారాష్ట్ర సదన్ లో జరిగిన 6 వ జల్ ప్రహరీ సమ్మాన్ కార్యక్రమం లో జల శక్తి కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ ఏడాది 22 మంది పురుషులు, 11 మంది మహిళలకు పురస్కార ప్రధానం జరిగింది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కూడా ఈ పురస్కార కార్యక్రమానికి హాజరు కావలిసి ఉన్నప్పటికీ, జిల్లా లో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలు అవుతున్న నేపథ్యంలో కలెక్టర్ పురస్కారం అందుకునేందుకు వెళ్లలేకపోయారు.భూ గర్భ జలాలు తక్కువ ఉండే జనగాం జిల్లాలో 2024-2025 ఆర్థిక సంవత్సరం గాను నీటి సంరక్షణలో పనులలో భాగంగా గ్రామీణ అభివృద్ధి , పంచాయతీ శాఖ , అగ్రికల్చర్, ఫారెస్ట్, ఇరిగేషన్, ఉద్యనవన, తదితర శాఖ లను సమన్వయ పరిచి చెక్ డ్యామ్ లు , చిన్న నీటి కుంటలు, గుట్టల ప్రాంతాలలో తవ్వే ఖాన్ టూర్ కందకాలు, ప్రభుత్వ భవనాల నుండి పడ్డ వర్షపు నీటిని సంరక్షణ చేసేందుకు పనులు , ఇజిఎస్ ద్వారా ప్రతీ ఇంటికి ఒక సోక్ పిట్ లు, వాటర్ షెడ్ కార్యక్రమ ద్వారా గల్లీ ప్లగ్గింగ్ ( విడి రాళ్ళ కట్టలు ) , ఫామ్ పాండ్లు, ఉద్యానావన శాఖ ద్వారా ఆయిల్ పామ్ పంట సాగు వివిధ శాఖల అ,ధికారుల భాగస్వామ్యం తో, వన మహోత్సవం లో భాగం గా ప్రతీ జీపీ లో 283 నర్సరీ ల ఏర్పాటు చేసి, ప్రతీ సంవత్సరం 25 లక్షల మొక్కలను నాటే లక్ష్యం తో ముందుకు వెళ్తున్నామని. సుమారుగా 2024-2025 ఆర్ధిక సంవత్సరం కి గాను ఒక లక్ష పై చిలుకు నీటి సంరక్షణ పనులను పూర్తి చేయడం జరిగినట్లు, 2025-2026 ఆర్ధిక సంవత్సరం కి గాను మన జిల్లా మన నీరు లో భాగంగా 2 లక్షలకు పైగా భూగర్భ జల సంరక్షణకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని జల్ శక్తి శాఖ వారికి నివేదిక ను అందించి కలెక్టర్ వివరించారు.డిస్ట్రిక్ట్ గ్రౌండ్ వాటర్ అసెస్మెంట్ రిపోర్ట్ ఆధారం గా జిల్లా లో భూగర్భ జలాలు పెరిగినట్లు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ గుర్తించడం కూడా ఈ పురస్కారానికి దోహద పడింది.

## కూకట్‌పల్లిలో 'కబ్జా' పర్వం.. పదేళ్ల అరాచక పాలనకు హైడ్రా సాక్ష్యం !

**రూ. 20 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తుల లూటీకి ఎమ్మెల్యేదే బాధ్యత**

**ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు..**

**రాజీనామా చేసి ప్రజాకోర్టుకు రావాలి... కాంగ్రెస్ నేత గాదె శివ చౌదరి**



కూకట్ పల్లి, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి నియోజకవర్గం గడిచిన పదేళ్లలో కబ్జాలకు, అరాచకాలకు అడ్డాగా మారిందని, స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై వచ్చినన్ని అవినీతి, భూకబ్జా ఆరోపణలు రాష్ట్రంలో మరే (బిఆర్ఎస్) ఎమ్మెల్యేపై రాలేదని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారంతో సాగించిన అక్రమాలను తీవ్రస్థాయిలో ఎండగట్టారు.

### రూ. 20 వేల కోట్ల ఆస్తుల రక్షణ

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అత్యధికంగా చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురైంది ఒక్క కూకట్‌పల్లి నియోజకవర్గంలోనేనని శివ చౌదరి ఆరోపించారు. ఇటీవల 'హైడ్రా' చేపట్టిన చర్యలే ఇందుకు నిదర్శనమని, దాదాపు రూ. 20 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను హైడ్రా కాపాడిందని గుర్తుచేశారు. సాక్షాత్తూ ఎమ్మెల్యే నివాసానికి, క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న 'నల్లచెరువు'లోనూ 9 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని, కోట్లాది రూపాయల విలువైన ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసి సుందరీకరణ పనులు చేపట్టిందని తెలిపారు.

### తెరవెనుక దందా.. అడ్డువస్తే ఖాకీలతో వేధింపులు

నియోజకవర్గంలో ఏ స్థాయి నాయకుడైనా, వ్యాపారవేత్తయినా తనకు ఎదురు చెబితే.. అప్పటి పోలీసు అధికారులను గుప్పెట్లో పెట్టుకుని అక్రమ కేసులు బనాయించి వేధించేవారని, చివరికి అక్రమాలను ప్రశ్నించిన జర్నలిస్టులపైనా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారని మండిపడ్డారు.

### సంక్షేమం శూన్యం - అవినీతి మాత్రం ఘనం

గత పదేళ్లలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎమ్మెల్యే చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. పేదలకు ఒక్క రేషన్ కార్డు గానీ, ఇళ్ల స్థలాలు గానీ, ఇళ్ల పట్టాలు గానీ ఇవ్వలేకపోయారని, దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాలు అర్హులకు అందలేదని విమర్శించారు. ఎమ్మెల్యే అండ చూసుకుని లోకల్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు సైతం స్థాయికి మించి అవినీతికి పాల్పడ్డారని, దొరికిన కాడికి దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రాజీనామా డిమాండ్

బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో కూకట్‌పల్లి ప్రజలు, వ్యాపారులు ఇప్పుడిప్పుడే స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారని శివ అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని నిరూపించుకునే చిత్తశుద్ధి ఆయనకు ఉంటే.. తక్షణం తన పదవికి రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలోకి రావాలని, ప్రజాకోర్టులో తీర్పు కోరాలని గాదె శివ డిమాండ్ చేశారు.

# శివరాంపల్లి గ్రామాన్ని కాటేదాన్ డివిజన్లో కలపాలి





### అత్తాపూర్ డివిజన్ సమగ్రంగా ఏర్పాటు చేయాలి

### డివిజన్‌ల ఏర్పాటుపై వినతి పత్రాలు

రాజేంద్రనగర్, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ఐదు డివిజన్లను ఏడు డివిజన్లుగా ఏర్పాటు చేశారు. అయితే నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు డివిజన్లో భౌగోళికంగా తమకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని శివరాంపల్లి, అత్తాపూర్ వాసులు జిహెచ్ఎంసి కార్యాలయంలో అభ్యంతర వినతి పత్రం అందజేశారు. శివరాంపల్లి కి చెందిన మాజీ కౌన్సిలర్ సదాల సూర్య రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు సదాల చంద్రారెడ్డి, మాదూరి ప్రభాకర్ రెడ్డి, చెరుకుపల్లి సింహం రెడ్డి, వరకాంతం నరసింహారెడ్డి, దాసరి సత్యనారాయణ లు జిహెచ్ఎంసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. శివరాంపల్లి గ్రామాన్ని కాటేదాన్ డివిజన్లో రెవెన్యూ గ్రామంగా పరిగణలోకి తీసుకొని కలపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. శివరాంపల్లి గ్రామం దేశంలోనే అత్యున్నత పోలీస్ శిక్షణ కేంద్రం పేరు ఉందని అందుకోసం తమ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని కాటేదాన్ రెవెన్యూ గ్రామంగా ఉన్న ప్రాంతాన్ని శివరాంపల్లి పేరుతో డివిజన్ ఏర్పాటు చేయాలని జిహెచ్ఎంసి అధికారులను కోరారు. బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య ఆధ్వర్యంలో అత్తాపూర్ వాసులు తమ బస్తీలు భౌగోళికంగా డివిజన్లో కలపాలని కోరారు.

# రెండవ విడత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి:

### జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం) ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బందిని నియమించుట కొరకై రెండవ విడత లో రెండవ ర్యాండమైజెషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ , జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. శుక్రవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ , జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండవ విడతలో మూడవ ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలనుర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి తేదీ: 13-12-2025న వారికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించడంజరుగుతుందని, ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠినచర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్,(లోకల్ బాడీస్) డీపీఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని పాఠశాలలో చేరవద్దు, వారు నిర్వహించే ప్రవేశ పరీక్షలను రాయవద్దు

### ఎం ఈ ఓ శంకర్ రాథోడ్

బుద్వేల్, డిసెంబరు 12 (ప్రభాత ఉదయం): అత్తాపూర్ లో గల రెజోనాన్స్ పాఠశాలకు గుర్తిం పు లేదని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ఆ పాఠశాల పేరుతో నిర్వహించనున్న మొగా రెసో ఫాస్ట్ ప్రవేశ పరీక్షకు కూడా ఎలాంటి అనుమతులు లేవన్నారు. విద్యార్థులు అనుమతి లేని ప్రవేశ పరీక్షకు హాజరు కావద్దన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనుమతి లేని పాఠశాలలో చేరవద్దని, వారు నిర్వహించే ఎలాంటి ప్రవేశ పరీక్షలను రాయించవద్దని సూచించారు.



# అమీన్‌పూర్‌ను నాలుగు డివిజన్లుగా విభజించాలి: బీజేపీ డిమాండ్


పటాన్ చెరు డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం): అమీన్ పూర్ మున్సిపల్ పరిధిని నాలుగు డివిజన్లుగా పునర్విభజించాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ అమీన్ పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో అమీన్ పూర్ జిహెచ్ఎంసి ఉప కమిషనర్ జ్యోతి రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఉమ్మడి అమీన్ పూర్ మున్సిపాలిటీలో ఓటర్ల సంఖ్యను దృష్టిలో పెట్టుకుంటే కనీసం నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలి, జిహెచ్ఎంసిలో అనేక డివిజన్లు 20%-%25 వేల ఓట్లతో ఉండగా, అమీన్ పూర్ లో మాత్రం 50 వేలకు పైగా ఓట్లతో ఒక్కో డివిజన్ గా ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా అన్యాయం" అని ఎద్దేవా చేశారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధి ప్రజలపై భారంగా మారుతున్న ఈ డివిజన్ విధానాన్ని వెంటనే సవరించి, న్యాయ సమ్మతంగా నాలుగు డివిజన్లు గా రూపొందించాలని ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఉప కమీషనర్‌ను కోరినట్లు తెలిపారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని ఈర్ల రాజు ముదిరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్, జిల్లా నాయకులు అగారెడ్డి, టౌన్ వన్ అధ్యక్షులు అనిల్ చారి, మండల వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ గౌడ్, నాయకులు సముద్రాల రాకేష్, కల్వకుంట్ల రాకేష్, పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈశ్వర చారి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం

### కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కులు అందజేసిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్

కూకట్ పల్లి, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించలేదంటూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ లో నివాసం ఉండే ఈశ్వర చారి మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతూ శుక్రవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈశ్వర చారి నివాసానికి వెళ్లి రూ. ఐదు లక్షల చెక్కులు కుటుంబ సభ్యులకు అందజేశారు. మీకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు వారు హామీ ఇచ్చారు.



# శంషాబాద్ మండలంలో విజయం సాధించిన బిజెపి ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ బిజెపి ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

శంషాబాద్, డిసెంబర్ 12(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులను రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి ఇన్చార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ శుక్రవారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజక వర్గ శంషాబాద్ మండల నానాజీ పూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా గెలుపొందిన నానాజీపూర్ సర్పంచ్ మైలారం సురేఖ- రాజు, ఉప సర్పంచ్(6వ వార్డు): ఎ విజయ్ కుమార్ వార్డు సభ్యుడు(1వ వార్డు):మున్నూరు సిద్దులు వార్డు సభ్యురాలు (3) : మైలారం రాధిక- శ్రీనివాస్ తదితరులు రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఊరిని మన సొంత ఇంటిలాగా చూసుకోవాలని ప్రజలను మన తో కుటుంబ సభ్యుల చూసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లపుడు కృషి చేయాలన్నారు. ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా అందరూ కలిసి కట్టుగా ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని ప్రతి ఒకరికి సూచించడం జరిగింది. మీకు వచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదే విధంగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం చాలా గొప్ప అవకాశమని ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని మరొకసారి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంగ మహేందర్ రెడ్డి, మైలారం శివ లింగం, టి. సిద్ధేశ్వర గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కె. వెంకటేష్ గౌడ్, ఏ. సంతోష్ యాదవ్, పి రమేష్, ఏ శివ లింగం, వీరేష్ చారి, జె శ్రీనివాస్, వి శివ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అమీన్పూర్‌లో ఎస్ టి పి ప్లాంట్ ఏర్పాటు: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం): అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ప్రతిపాదించిన ఎస్ టి పి ప్లాంటును ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నెంబర్ పరిధిలో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు కోసం నిర్దేశించిన స్థలాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నంబర్ పరిధిలోని 10 ఎకరాలలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి గతంలో ప్రతిపాదనలు చేయడం జరిగిందని తెలిపారు. ఇదే సర్వే నెంబర్ లో 5 ఎకరాలు స్టేడియానికి, పది ఎకరాలు నవోదయ విద్యాలయానికి సైతం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎస్ టి పి ప్లాంట్ ను స్టేడియానికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారని.. దీని మూలంగా స్థానిక కాలనీల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు తనకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. స్టేడియానికి కేటాయించిన స్థలంలో కాకుండా కాలనీలకు దూరంగా కేటాయించిన పది ఎకరాలలోనే ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. నూతన టెక్నాలజీతో ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దుర్వాసన సమస్య తలెత్తకుండా ప్లాంటు పనులు కొనసాగుతాయని తెలిపారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షమేనని,ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో హార్టీకల్చర్ డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి(ములుగు), డిసెంబర్ 12(ప్రభాత ఉదయం) సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని ఉద్యాన కళాశాలలలో ఉద్యాన డిగ్రీ లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. భగవాన్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి బీ. ఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ డిగ్రీలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈనెల 17న ఉదయం 10.30 నుంచి బైపీసీతో '%జూూాజజు%-2025'కు అర్హులై, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంబైన్డ్ కౌన్సిలింగ్ కు దరఖాస్తులు సమర్పించి, ర్యాంకు పొందిన విద్యార్థులు ఈ కౌన్సిలింగ్ కు హాజరు కావచ్చని వివరించారు. హైదరాబాద్ రాజేంద్రననగర్ లోని ఉద్యాన కళాశాలలో 15 సీట్లు, వనపర్తి జిల్లా మోజెర్ల ఉద్యాన కళాశాలలో 32 సీట్లు, మహబూబాబాద్ జిల్లాలోని మల్యాల కళాశాలలో 10 సీట్లు ఉన్నాయన్నారు. హైదరాబాద్ లోని రాజేంద్రనగర్ లో గల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్ సెంటర్లో కౌన్సెలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలు www.skltghu.ac.in: www.pjtau.edu.inలలో పొందవచ్చు. 96524 56779 మొబైల్ నెంబర్ లో సైతం సంప్రదించవచ్చు.

# నమ్మి ఓటేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టండి: నీలం మధు

### మీకోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా నిలబడాలని సూచన

### నన్ను నమ్ముకున్న వారికోసం నేనున్నానని భరోసా




పటాన్ చెరు, డిసెంబర్ 12 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని నీలం మధు ముదిరాజ్ అన్నారు. పంచాయితీ ఎన్నికల్లో గెలుపొందిన నల్లవల్లి సర్పంచ్, కానుకుంట వార్డ్ సభ్యులను ఘన సన్మానం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తూ అండగా నిలబడాలని నూతన సర్పంచ్ లు, వార్డ్ సభ్యులకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ సూచించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంఆర్ యువసేన అభ్యర్థిగా ఘనవిజయం సాధించిన నల్లవల్లి నూతన సర్పంచ్ కొరివి రాణి సురేష్ మరియు కానుకుంట వార్డ్ సభ్యులను శుక్రవారం నీలం మధును చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రామస్థులతో కలిసి వారిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని నీలం మధు ఘనంగా సన్మానించారు, గ్రామ ప్రజల ఆదరాభిమానాలు గెలుచుకుని సర్పంచ్ గా విజయం సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్త నుంచి నాయకులుగా ప్రస్థానం ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కోసం ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన ప్రతి ఒకరికి గుర్తింపు దక్కుతుందని భరోసా ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, వార్డ్ మెంబర్లు గ్రామాభివృద్ధికి పాటుపడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్తూ రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నల్లవల్లి వార్డ్ సభ్యులు నర్సింలు స్వరూప, కానుకుంట వార్డ్ సభ్యులు పోతురాజు నవీన్, ఎల్లబోయిన ప్రేమ్ దాస్, ఏళ్లబోయిన నాగరాజు, ఎర్రోల నరేష్ బాబు, కాంగ్రెస్ శ్రేణులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608